ప్రజాశక్తి
బుధవారం 7 మే 2025
5
అనంతపురం



సజావుగా గ్రూప్-1 పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఎపిపిఎస్‌సి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. పివికెకె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్ష కేంద్రంలో 234 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 149 హాజరు అయ్యారు. 85 మంది గైర్హాజరయ్యారు. శ్రీ బాలాజీ పీజీ కాలేజీ పరీక్ష కేంద్రంలో 360 మందికి గాను 232 మంది హాజరయ్యారు. 128 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి తిప్పేనాయక్ పాల్గొన్నారు.

14 ఏళ్లకు ఓఎంసి తీర్పు



- తీర్పు వెలువరించిన సిబిఐ కోర్టు
- గాలి జనార్ధన్‌తోపాటు ఐదుగురికి జైలు
- సంచలనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఓబుళాపురం మైనింగ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దశాబ్దకాలం పాటు సంచలనాలకు కేంద్ర బిందువైన ఓబుళాపురం మైనింగ్ వ్యవహారంపై కోర్టు తీర్పు వెల్లడైంది. ఇందులో ఐదుగురిని నిందితులుగా చేర్చి సిబిఐ కోరు మంగళవారం నాడు తుది తీర్పును వెలువరించింది. ఈ కేసులో గాలి జనార్ధన్‌రెడ్డితోపాటు ఆయన సమీప బంధువు బివి.శ్రీనివాసరెడ్డి, ఆయన వ్యక్తిగత సహాయకుడు మెహఫాజ్ అలీ ఖాన్, రిటైర్డు మైనింగ్ ఎండి రాజగోపాల్, ఓబుళాపురం మైనింగ్ కార్పొరేషన్ సంస్థలపై శిక్షను ఖరారు చేయడంతోపాటు లక్షరూపాయల జరిమానాను విధిస్తూ తీర్పు నిచ్చింది. ఈ కేసులో నిందితురాలుగానున్న తెలంగాణ రాష్ట్రం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కృపానందంలను నిర్ధోషులుగా ప్రకటించింది.

14 ఏళ్ల పాటు విచారణ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓబుళాపురం మైనింగ్ వ్యవహారం రాజకీయంగా పెను దుమారం రేపింది. అప్పట్లో అధికార, ప్రతిపక్ష పార్టీలకు ఓఎంసి ఓ రాజకీయ విమర్శనాస్త్రంగా ఉండేది. అనంతపురం జిల్లా డీ.హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో ఇనుప ఖనిజం ఉంది. ఈ ఇనుప ఖనిజం తవ్వకాల అనుమతి పొందిన ఓబుళాపురం మైనింగ్ కార్పొరేషన్ 2004 నుంచి 2009 వరకు పెద్దఎత్తున తవ్వకాలు జరిపింది. అనుమతులకు మించి తవ్వకాలు చేపట్టి, తప్పుడు పత్రాలతో ఇతర దేశాలకు ఎగుమతి చేసిందన్న అభియోగాలున్నాయి. దీనిపై 2009లో ముఖ్యమంత్రిగా రోశయ్య ఉన్న సమయంలో విచారణకు సిబిఐకి అప్పగించారు. 2011లో ఈ కేసు విచారణ నిమిత్తం గాలి జనార్ధన్‌రెడ్డిని మొదటిసారి అరెస్టు చేశారు. అదే సంవత్సరంలో తొలి ఛార్జిషీట్‌ను సిబిఐ దాఖలు చేసింది. ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మితోపాటు, మొత్తం తొమ్మిది మందిపై అభియోగాలతో ఈ కేసు నమోదు చేశారు. కేసు విచారణ క్రమంలో 2022లో శ్రీలక్ష్మిని నిర్ధోషిగా ప్రకటించారు. మరొకరు మృతి చెందారు. ఈ కేసును ఈ ఏడాది మేలోపు పూర్తి చేయాలని సుప్రీంకోర్టు గడువు విధించింది. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణ పూర్తయి మంగళవారం నాడు తుది తీర్పును వెలువరచింది.

ఓంఎసి లీజుల్లో అవకతవకలు

డీ.హీరేహాళ్ మండలం పరిధిలోని ఓబుళాపురం, మలపనగుడి ప్రాంతంలో మొత్తం ఆరు మైనింగ్ లీజులుండేవి. అందులో ఓబుళాపురానికి సంబంధించి మూడు లీజులుండేవి. అందులో ఒక లీజు 68.52 హెక్టార్లు కాగా, 39.50 హెక్టార్లు, 25.98 హెక్టార్లు లీజులిచ్చారు. ఇందులో అంతర గంగ కొండపైనున్న 68.52 హెక్టార్లలో మైనింగ్‌లో అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలింది. సుమారు రూ.884.13 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఇవి నిర్ధారణ కావడంతో ఐదుగురికి శిక్ష ఖరారైంది.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన సందర్భంగా ఏర్పాట్లను త్వరితగతిన, పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆదేశించారు. ఈ నెల 9వ తేదీన ముఖ్యమంత్రి ఉరవకొండ నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో మంగళవారం నాడు వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం వద్దనున్న హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను ముఖ్యమంత్రి పరిశీలిస్తారన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. అనవసర బ్యారికెడ్‌లను ఏర్పాటు చేయొద్దన్నారు. సభా ప్రాంగణంలో ఆ గ్రామానికి చెందినవారే ఉండే విధంగా చూడాలన్నారు. 14 నియోజకవర్గాల పరిధిలో ఒక్కొక్క నియోజకవర్గ నుంచి 10 మంది ఆయకట్టు రైతులు మొత్తంగా 3వేల వచ్చేవిధంగా చూడాలని పీడీ డీఆర్డీఏ అధికారులకు సూచించారు. హెలిప్యాడ్, కాన్వాయ్, సభా ప్రాంగణం, తదితర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. అవసరం ఉన్నచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, జాయింట్ కలెక్టర్

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ఉరవకొండ : ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం వద్ద హెలిప్యాడ్, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ, గ్రామసభ వద్ద ఏర్పాట్లను ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. హెలిప్యాడ్ వద్ద త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని అనంతపురం ఆర్డీవో, ఆర్అండ్‌బి ఎస్ఈలను ఆదేశించారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ బ్రిడ్జి వద్ద అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలని హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈకి సూచించారు. గ్రామసభ ఏర్పాటు కోసం తగిన చర్యలు తీసుకోవాలని గుంతకల్ ఆర్డీవోని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు కేశవ నాయుడు, శ్రీనివాస్, డిపిఒ నాగరాజు నాయుడు, జిల్లా పరిషత్ సీఈవో రామచంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, ఆర్అండ్‌బి ఎస్ఈ రాజగోపాల్, డిఎల్డివోలు లలితాబాయి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అనంతపురం

సమస్యలపై ప్రజలు అందించే అర్జీలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించనున్నట్లు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. అనంతపురం నగరంలోని రాంనగర్‌లో ఉన్న ఆయన నివాసంలో మంగళవారం నాడు ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాంటివన్నారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలు అందించిన అర్జీలను పరిశీలించి వాటికి తక్షణ పరిష్కారం చూపుతామన్నారు.

ఉగ్రదాడి బాధితులపై సోషల్ మీడియాలో దాడిని ఖండిద్దాం

ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పహల్గాం ఉగ్రవాద దాడిలో మృతిచెందిన బాధిత కుటుంబ సభ్యులు హిమాన్షీ నర్వాల్, ఆరతి మీనన్ పై సోషల్ మీడియాలో జరుగుతున్న దాడిని ఖండిద్దామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పహల్గాం ఉగ్రవాద బాధితులపై సోషల్ మీడియాలో దాడి చేయడం అమానుషంగా ఉందన్నారు. ఈ దాడిని నిరసిస్తూ నేడు ఎన్జీఓ హోంలో సాయంత్రం 5 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాజిక శ్రేయోభిలాషులు, మేధావులు, రచయితలు ప్రజలు పాల్గొని పహల్గాం ఉగ్రవాద దాడి బాధితుల పక్షాన నిలబడదామని విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఇలాంటి చర్యలు సరికావని వీటిని ముక్తకంఠంతో ఖండిద్దామని పిలుపునిచ్చారు.

1200 పడకలకు ఆసుపత్రిని విస్తరిస్తాం

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

ఆసుపత్రిలో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం సర్వజనాసుపత్రిని 1200 పడకల ఆసుపత్రిగా త్వరలో విస్తరిస్తామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. జెఎన్‌టియు రోడ్‌లో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సప్తగిరి క్యాంపర్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సప్తగిరి క్యాంపర్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం అన్నారు. ఇప్పటికే సర్వజనాసుపత్రితో పాటు సిడి హాస్పిటల్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలలో 25 లక్షలతో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేశారన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతపురం సర్వజనాసుపత్రిలో అవసరమైన భవనాల నిర్మాణానికి రూ.38కోట్లతో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సన్మానించారు.



ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

నిర్లక్ష్యం నీడన తపాలా కార్యాలయం

ఎక్కడ సమస్యలు అక్కడే-కార్యాలయంలోకి కుక్కలు-కొరవడిన పర్యవేక్షణ

ప్రజాశక్తి-అనంతపురం

ఇదేదో మారుమూల ప్రాంతంలోని తపాలా కార్యాలయం అనుకుంటే పొరపాటే. అనంతపురంలోని టవర్ క్లాక్ సమీపంలోని జిల్లా స్థాయి ప్రధాన తపాలా కార్యాలయం. ఇక్కడ నుంచే జిల్లావ్యాప్తంగా అన్ని తపాలా కార్యాల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో జరుగుతుంది. జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ఉన్న కార్యాలయం నిరంతరం రద్దీతో కిటకిటలాడుతుంది. అయితే ప్రధాన కార్యాలయంలో పరివేక్షణ లోపం కారణంగా 'ఎక్కడ వేసిన గొంగళి' అన్నచందంగా ఉండడంతో తపాలా కార్యాలయానికి వస్తున్న కస్టమర్లు పలు రకాల ఇబ్బందులకు గురి అవుతున్నారు. ముఖ్యంగా పాలకవర్గాలు జిల్లాస్థాయి అధికారులు ఒకవైపు స్వచ్ఛత మంత్రాలు జపిస్తుంటే ఇక్కడ అందుకు విరుద్ధంగా వ్యవహరించడం పట్ల తీవ్రమైన విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు కార్యాలయంలో నేరుగా కుక్కలు, ఇతర జంతువులు సైతం ప్రవేశిస్తున్నాయంటే పరిస్థితి ఎలా ఉంటుందో తెలుస్తుందన్నారు. మరోవైపు తపాలా కార్యాలయం సీసీ కెమెరాలు నిఘా పర్యవేక్షణలో ఉన్న ఉన్నత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పరిశుభ్రత పర్యవేక్షణ లోపం కారణంగా తపాలా కార్యాలయ సేవలపై ఈ ప్రభావం పడుతోందని పలువురు భిన్న స్వరాలు వినిపిస్తున్నారు. సూపర్ ఇంటెండెంట్ స్థాయి అధికారులు ఉన్నచోటే ఇలాంటి పరిస్థితులు ఉంటే మరి మారుమూల ప్రాంతాల్లో ఎలాంటి పరిస్థితులు ఉంటాయి అనే భావనలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశుభ్రతపై పర్యవేక్షణపై దృష్టి సారించి తపాలా సేవలపై విశ్వాసం పెరిగేలా చూడాలని ఆ కార్యాలయానికి వచ్చే సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.




అనంతపురంలోని తపాలా కార్యాలయంలో పడుకున్న కుక్కలు

కార్మికులకు టెండర్ ప్రాసెస్ ఇవ్వాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం

ప్రయివేట్ కాంట్రాక్టర్లకు కాకుండా సొసైటీకే టెండర్ అప్పగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నగరంలోని ట్రాన్స్‌కో ఎస్ఇ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఇ కార్యాలయం జిల్లా స్టోర్స్ హమాలీలు 14 సంవత్సరాలుగా డిపిల లోడింగ్, అన్లోడింగ్ చేస్తున్న కార్మికులకు టెండర్ ప్రాసెస్ ఇవ్వకుండా రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అనంతపురం జిల్లాలో ప్రయివేట్ కాంట్రాక్టర్లకు అప్పజెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2024లో జిల్లాలో కొందరు బయట కాంట్రాక్టర్లు లోడింగ్, అన్‌లోడింగ్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను ఎస్ఎస్ఆర్ రేట్ల కంటే తక్కువ లెస్‌కు టెండర్ వేయడం వల్ల గతంలో వస్తున్న ఆదాయం కంటే తక్కువ వేతనం తీసుకున్నట్లు తెలిపారు. దీనివల్ల తమ కుటుంబాలు గడవడం కూడా గగనంగా మారిందన్నారు. ఈనేపథ్యంలో కార్మికులు ఏర్పాటు చేసుకున్న సొసైటీలకే పనులు అప్పగించాలని, లేనిపక్షంలో ఈనెల 5వతేదీ నుంచి లోడింగ్, అన్‌లోడింగ్ పనులను నిలిపివేయనున్నట్లు తెలిపారు. అనంతరం సూపరింటెండింగ్ ఇంజినీరు శేషాద్రికి వినతిపత్రం అందించారు. ధర్నాకు సిఐటియు నగర కార్యదర్శి ముత్తుజ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నబిరసూల్, మారుతీకుమార్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధు, మహబూబ్‌బాషా మద్దతు తెలిపారు. ది డిస్ట్రిక్ట్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (సిఐటియు) అధ్యక్షులు గంగాధర్, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, కార్యదర్శి ఎం.షమీర్‌బాషా, సంయుక్త కార్యదర్శి ఎస్ఎండి హాజీవలి, కోశాధికారి కె.చెన్నకేశవులు, కార్మికులు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నాయకుల



విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని మస్తాన్‌పేట, ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన సిమెంట్ కరెంటు స్తంభాలకు విద్యుత్ తీగలు అమర్చి ప్రమాదాలను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ రఘుకు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల క్రితం మస్తాన్‌పేట, ట్రావెలర్స్ బంగ్లా నుంచి పోటర్ లైన్ వెళ్లే దారిలో రోడ్డు పనులు చేస్తున్న సమయంలో విద్యుత్ అధికారులు కరెంట్ పోల్స్ ఏర్పాటు చేశారన్నారు. అయితే ఇప్పటి వరకూ విద్యుత్ తీగలు లాగలేదన్నారు. ఈ సమస్యపై అనేకసార్లు విద్యుత్తు శాఖ అధికారులకు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, పట్టణ కమిటీ సభ్యులు షాషా, రఘు, ఆది, సురేంద్ర, రాము, వీరన్న, ఖాదర్, ఓబులేసు, నాగరాజు, శీన, మక్బూల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ అభ్యర్థులకు గ్రాండ్ టెస్టులు

విప్ కాలవ శ్రీనివాసులు



మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

డీఎస్సీ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల్లో అధిక మంది ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నట్లు విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పట్టణంలోని స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో మునుపెన్నడూ లేని విధంగా దాదాపు 16వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడంతో నిరుద్యోగుల్లో ఉద్యోగ భద్రతపై ఓ నమ్మకం ఏర్పడిందన్నారు. ఈనేపథ్యంలో దాదాపు 14 మంది అత్యుత్తమ బోధకులతో వంద రోజులపాటు 400 మందికి టెట్, డిఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇప్పించామన్నారు. టెట్ పరీక్షలో 208 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. శిక్షణ పొందిన వారందరికీ ఈనెల 11 నుంచి జూన్ 4వ తేదీ వరకూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10 గ్రాండ్ టెస్టుల నిర్వాహణకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

ఇండో అమెరికన్ బసవతారకం స్మారక కేన్సర్ ఇన్స్టిట్యూట్ సౌజన్యంతో రాయదుర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 11న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కాలవ శ్రీనివాసులు తెలిపారు. క్యాన్సర్ లక్షణాలున్న వారు సుదూర ప్రాంతాలకు వెళ్లి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం వ్యయ ప్రయాసాలతో కూడుకుందన్నారు. కావున ప్రజల సౌకర్యార్థం స్థానికంగానే ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



పోలీసు ఉన్నతాధికారులను కలిసి బయటకు వస్తున్న వైసిపి నాయకులు

తాడిపత్రికి వెళ్లనివ్వండి

పోలీసు అధికారులను కోరిన పెద్దారెడ్డి, అనంత

ముఖ్యమంత్రి పర్యటన తర్వాత పంపుతామన్న ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం

తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లే అంశం జిల్లా పోలీసు అధికారుల దృష్టికి వెళ్లింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం శాంతిభద్రతల నేపథ్యంలో పెద్దారెడ్డిని తాడిపత్రికి వెళ్లేందుకు అనుమతించలేదు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించి తాడిపత్రికి వెళ్లేలా అనుమతులు తెచ్చుకున్నారు. కోర్టు తీర్పు పత్రాలను తీసుకుని మంగళవారం నాడు వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డితో కలిసి ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ పోలీసు ఉన్నతాధికారులకు హైకోర్టు తీర్పు పత్రాలను అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 9వ తేదీన అనంతపురం జిల్లా పర్యటన ముగిసిన తర్వాత పెద్దారెడ్డిని తాడిపత్రికి అనుమతిస్తామని ఎస్పీ వైసిపి నాయకులకు తెలిపారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులను కలిసిన అనంతరం అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిలు విలేకరులతో మాట్లాడారు. పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లే అంశంపై పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడామన్నారు. కోర్టు ఉత్తర్వులను అనుసరించి సెక్యూరిటీ ఇచ్చి పెద్దారెడ్డిని తాడిపత్రికి పంపాల్సిన బాధ్యత ఎస్పీపై ఉందని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత తెలిపారు. కాగా ఈ నెల 8వ తేదీన తాను తాడిపత్రికి వెళ్లనున్నట్లు కేతిరెడ్డి పెద్దారెడ్డి పోలీసులకు వినతి ద్వారా తెలియజేశారు.

ఆర్డీటీకి విదేశీ నిధులను అడ్డుకోవడం దారుణం : సిపిఎం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

జిల్లాలోని పేదలకు అనేక సేవలు అందిస్తున్న ఆర్డీటీ సంస్థకు విదేశీ నిధులు రాకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమని సిపిఎం మండల కార్యదర్శి అమ్మలదిన్నె కుళ్లాయప్ప అన్నారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు జిల్లా అయిన అనంతపురంలో 1969 నుంచి ఆర్డీటీ సంస్థ పేదలకు అనేక సేవలు చేస్తోందన్నారు. ఆర్డీటీ సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్డీటీకి విదేశీ నిధుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జై భీమ్‌రావు, వీరనాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేని పంచాయతీలుగా తీర్చిదిద్దుదాం

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలో సమస్యలు లేని పంచాయతీలుగా తీర్చిదిద్దేందు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని భీమునిపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానికులు పలు సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా మండలంలో ఎవరైనా నిరుద్యోగ యువతీ,యువకులు 10 నుంచి బిటెక్ విద్యను పూర్తి చేసిన వారు ఈనెల 13న తాడిపత్రిలో నిర్వహించే జాబ్‌మేళాలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఒ బారెన్సాహెబ్, ఎపిఎం బలీల్, మండల ఇంజినీర్ వరప్రసాద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

వాయిద్య ప్రదర్శనలో కందుకూరు విద్యార్థి ప్రతిభ

గిన్నిస్ బుక్ రికార్డులో చోటు


అవార్డు అందుకుంటున్న విద్యార్థి జోయల్‌పాల్, తల్లి సునీత

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన గ్రేస్ ఆఫ్ కల్వరి మినిస్ట్రీస్ సంఘం కాపరి పాస్టర్ పి.విజయ భాస్కర్, సతీమణి పి.సునీత కుమారుడు పి.జోయల్‌పాల్‌కు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. ఈ సందర్భంగా గ్రేస్ ఆఫ్ కల్వరి మినిస్ట్రీస్ చర్చి వ్యవస్థాపకుడు పి.మోసయ్య ప్రజాశక్తితో మాట్లాడుతూ 2024 డిసెంబర్ 1న హల్లెల్ మ్యూజిక్ స్కూల్ విజయవాడ వ్యవస్థాపకులు పాస్టర్ అగస్టీన్ దండంగి ఆధ్వర్యంలో సంగీత వాయిద్య ప్రదర్శన నిర్వహించగా 18 దేశాల నుంచి 1100 మంది సంగీత కళాకారులు పాల్గొన్నారు. ఆన్‌లైన్‌లో గంటపాటు సరిళ్ల స్వరాలను కీబోర్డ్‌పై ఆలపించిన వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేసి ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా 25 ఏప్రిల్ 2025న మెట్రోపాలిటన్ చర్చి విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పాస్టర్ దండంగి అగస్టీన్‌తో జోయల్‌పాల్ పురస్కారాన్ని అందుకున్నారు. అవార్డు వచ్చినందుకు సంఘం సభ్యులు, సంఘం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' ఇవ్వాలి

కౌలు రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు రంగయ్య, రంగారెడ్డి


మాట్లాడుతున్న కౌలు రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

కౌలు రైతులకు నూతన కౌలు రైతు చట్టం అమలు చేయడంతోపాటు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలరంగయ్య, రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఉరవకొండ మండల పరిధిలోని పెద్ద ముష్టూరు గ్రామంలో సంఘం జిల్లా నాయకులు వెంకటేశులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కౌలు రైతులను గుర్తించి సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయాలన్నారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా చాలా తక్కువ సంఖ్యలో సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేశారన్నారు. మిగిలిన వారికి వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సిసిఆర్‌సి కార్డులు ఉన్న రైతులకు బ్యాంకులో రుణాలు ఇవ్వాలని, ఖరీఫ్, రబీ సీజన్లలో సబ్సిడీ విత్తనాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా వంటి పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులు సీనప్ప, కార్యదర్శిగా రవికుమార్, సహాయ కార్యదర్శిగా తిప్పయ్య, కోశాధికారిగా మారన్న, కార్యవర్గ సభ్యులుగా తిప్పమ్మ, కిష్టప్ప, హరి, ఆదిలక్ష్మిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మోపిడి కమిటీ అధ్యక్షులు రామమూర్తి, కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై ఆందోళన వద్దు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు విషయంలో ముస్లింలు ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మంగళవారం అశోక్‌నగర్ ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నంత వరకూ ముస్లిములకు ఎలాంటి ఇబ్బంది రానివ్వరని తెలిపారు. ముఖ్యంగా వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుపై ఎలాంటి సందేహాలు వద్దన్నారు. ఇకపోతే అశోక్‌నగర్‌లోని కబరస్తాన్‌కు ప్రహరీ లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని షకిల్ షఫీ తన దృష్టికి తీసుకురాగానే రూ.80లక్షల నిధులు తీసుకొచ్చామన్నారు. అలాగే హిందూ స్మశాన వాటికలో కూడా రూ.45 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. ఇక్కడ అంత్యక్రియల సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షకీల్ షఫీ, మేయర్ వసీం, కమిషనర్ బాలస్వామి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌస్‌మోదీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి : బళ్లారి ఎంపి


మురళి ఆలయంలో బళ్లారి ఎంపి తుకారాం దంపతులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

డి.హీరేహాల్ మండలం మురడి గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని బళ్లారి ఎంపి తుకారాం అన్నారు. మంగళవారం ఆంజనేయ స్వామి ఆలయంలో ఎంపి తుకారాం, సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపి దంపతులకు ఆలయ అర్చకులు రామాంజనేయులు పూర్ణకుంభం సాదర స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద రూ.20లక్షల అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్ పురుషోత్తంరెడ్డి, సదాశివరెడ్డి, పాటిల్ అజయ్, వెంకట్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, షమీవుల్లా, బాబు, సమీర్, రంజిత్, ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల అవినీతిపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్ర వ్యాప్తంగా కుట్టుమిషన్ల శిక్షణ, పంపిణీల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి, జి.విశాలాక్షి డిమాండ్ చేశారు. వైసిపి రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం ఉప తహశీల్దార్ లలితకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ కె.మధుసూదన్‌రెడ్డి, నాయకులు బి.గురుప్రసాద్ యాదవ్, సివి.రంగారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌యాదవ్, ఎం.రంగస్వామి, బి.రమేష్‌రెడ్డి, ఎస్.రాముయాదవ్, బింగి కిరణ్, గోపీరెడ్డి, వెల్డింగ్ రవుఫ్, రాజేష్, కౌన్సిలర్లు వి.వరదరాజులు, కెవి రమణ, వాల్మీకి శివ, హసీనా, రూతమ్మ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమ్మె నోటీసు


నార్పలలో సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశాకార్యకర్తలు

ప్రజాశక్తి-నార్పల

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 20వతేదీన చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును మంగళవారం మండల పరిధిలోని బి.పప్పూరు పిహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్ హాజీరాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు మాట్లాడుతూ ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని, నియామకాలను ప్రభుత్వమే చేపట్టాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కావున సమ్మెలో ఆశావర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు రామసుబ్బమ్మ, కృష్ణవేణి, పద్మావతి, సునీత, అంజలికుమారి, లక్ష్మీనరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును మంగళవారం మండల కేంద్రంలోని హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌కు ఆశావర్కర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి, జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, శ్రీనివాసులు, మండల కార్యదర్శి నాగేంద్ర, ఆశావర్కర్లు పుష్పావతి, శ్రీదేవి, సునీత, సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వతేదీన చేపట్టనున్న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెకు సంబంధించిన నోటీసును ఆశావర్కర్లు మంగళవారం స్థానిక డాక్టర్ శివకృష్ణకు అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, డి.గాయత్రి, ఎం.నాగేంద్రమ్మ, ఎ.అరుణ, ఎం.అక్కమ్మ, ఎం.లక్ష్మీనరసమ్మ, ఎస్.చెన్నమ్మ, ఎ.వెంకటలక్ష్మి, ఎస్.ముత్యాలమ్మ, సి.లక్ష్మీదేవి, కె.సువర్ణ, ఎస్.నాగవేణి, అరుణ, కె.అనిత, వై.సావిత్రి, సి.నాగేశ్వరి, కె.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఆశా వర్కర్లకు ఉద్యోగులుగా గుర్తించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి అన్నారు. మంగళవారం విడపనకల్ మండల కేంద్రంలోని పిహెచ్‌సి, పాల్తూరు పిహెచ్‌సిలతోపాటు కూడేరు మండల కేంద్రంలోని పిహెచ్‌సిల్లో మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి భారతి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రంగారెడ్డి, మీనాక్షి, ఆదిలక్ష్మి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై నిర్లక్ష్యం తగదు

సిఐటియు ఆధ్వర్యంలో కొనసాగిన ధర్నా


ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

దీర్ఘకాలంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంతో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని సిఐటియు పట్టణ కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎటిఎం నాగరాజు, నాగభూషణం అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా మంగళవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్, రెగ్యులర్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేస్తున్నా ప్రభుతం, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. నగర ప్రజలకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. అనారోగ్యంతో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలని, కరోనా సమయంలో పని చేసిన కార్మికులకు రూ.15వేల వేతనంతోపాటు ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, రెగ్యులర్ ఉద్యోగులకు బకాయి సరెండర్ లీవ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 20, 21వతేదీల్లో దేశవ్యాప్తంగా సమ్మె చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, సురేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, రెగ్యులర్ కార్మికుల నగర అధ్యక్షుడు ముత్తురాజు, నగర కార్యదర్శి తిరుమలేసు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, కమిటీ సభ్యులు శ్రీనివాస్‌మూర్తి, బంగ్లా రాఘవేంద్రప్రసాద్, నాగేంద్ర, పెన్నా, కుమార్, పుల్లన్న, అదనపు కార్మికులు, బదిలీ కార్మికులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి : సిఐటియు


వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధి కాపాడి, కేంద్రం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు అనుబంధ రైల్వే కాంట్రాక్టు వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం రైల్వే డివిజినల్ మేనేజర్ శ్రీనివాస్‌గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లతో కార్మిక లోకానికి తీరని నష్టం ఏర్పడుతోందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఈనెల 20న నిర్వహించనున్న కార్మిక సంఘాల జాతీయ సమ్మె నోటీసు మద్దతుగా రైల్వే కార్మికులు సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. ప్రస్తుతం కార్మికులకు ఉన్న రక్షణగా వున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వాటన్నింటిని రద్దు చేసి కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదార్లకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. ఫలితంగా కార్మికులందరూ కట్టుబానిసలుగా పని చేయాల్సి వస్తుందన్నారు. ఉద్యోగ భద్రత, హక్కుల సాధనకు రైల్వే కాంట్రాక్ట్ కార్మికులందరూ ఈనెల 20న చేపట్టనున్న సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్టు కార్మికులు సంఘం నాయకులు మురళి, సిఐటియు నాయకులు ఉల్లిగప్ప, బాషా, తిమ్మప్ప, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలను ఆదుకోవాలి

వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్


కూలీలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల వద్దకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విరివిగా పనులు కల్పించి వలసలను ఆపాలన్నారు. పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. పనుల్లో అవినీతి, అక్రమాలను అరికట్టాలని, రాజకీయ జోక్యాన్ని నివారించాలన్నారు. ప్రతి జాబుకార్డుకు 200 రోజులు పనులు కల్పించాలని, రోజు వేతనం రూ.600 ఇవ్వాలని, అడిగిన వారందరికీ జాబ్ కార్డులు ఇవ్వాలని, ఉపాధి హామీ మేట్లకు పారితోషికం ఇవ్వాలని, హామీ పనుల వద్ద ప్రమాదవశాత్తు చనిపోయిన కూలీలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోషల్ ఆడిట్‌లో వెలికితీసిన అవినీతి సొమ్మును రికవరీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాష్, సుంకన్న, రామాంజనేయులు, జయరాముడు, లక్ష్మీనారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, కుళ్లాయిస్వామి, నాగరాజు, సావిత్రి, ఆదినారాయణ, సూర్యనారాయణ, రామాంజి, సంధ్యారాణి, సుబ్బమ్మ, నిర్మల, సుధారాణి, కిష్టన్న, ధనలక్ష్మి, వీరాంజి నరసింహుడు, తదితరులు పాల్గొన్నారు.

ఒపిఎస్ అమలుకు ఎపిటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్త-ఉరవకొండ

సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా పూర్వ కార్యదర్శి హనుమప్ప, జిల్లా ఉపాధ్యక్షులు సాకే భాస్కర్ డిమాండ్ చేశారు. పాఠశాలల్లో అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా ఉరవకొండ జోన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉరవకొండలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల అంటే ఒకటి నుంచి ఐదవ తరగతులలో మోడల్ ప్రాథమిక పాఠశాల లేదా బేసిన్ ప్రాథమిక పాఠశాల కొనసాగించాలన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆరు నుంచి పదవ తరగతి వరకు లేదా 12 తరగతుల వరకు ఉన్నత పాఠశాలలను యధావిదంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్సి కమిషన్ ఏర్పాటు చేసి 30శాతం అయ్యార్ ప్రకటించాలన్నారు. 11వ పిఆర్సి బకాయిలుతో పాటు పెండింగ్ లో ఉన్న మూడు డిఎలను ఇవ్వాలన్నారు. 2003 డీఎస్సీ వారికి ఒపిఎస్ అమలు చేయాలన్నారు. ఏకరీతిలో పదోన్నతల జాబితాను సీనియారిటీ ప్రకారం ఇవ్వాలన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు ఎస్.కిషోర్, ఉరవకొండ జోన్ నాయకులు పాండురంగ, రాజేష్, నాగేంద్ర, మనోహర్, దాదాఖలందర్, పాలాక్షి, అశోక్‌కుమార్, మనోహర్, శర్మస్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో పార్టీని బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి-అనంతపురం

అందరం సమిష్టిగా పని చేసి పార్టీ పటిష్టకు కృషి చేద్దామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో శింగనమల నియోజకవర్గ వైసిపి అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన వారు అనంత వెంకటరామిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైసిపి కార్యకర్తలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. వాటిని ఎండగట్టాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం

ముందస్తు అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న శ్రీచైతన్య పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి హనుమంతునాయుడు, కుళ్లాయిస్వామి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నగరంలోని కోర్టు రోడ్డు వద్ద ఉన్న శ్రీచైతన్య విద్యాసంస్థ ముందు ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్యా సంవత్సరం ప్రారంభం కాక మునుపే శ్రీచైతన్య విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారని మండిపడ్డారు. అంతేగాకుండా పుస్తకాల పేరుతో వేలకు వేలు వసూలు చేస్తున్నారన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి శ్రీచైతన్య పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు నరసింహ యాదవ్, వెంకట్‌నాయక్, చందు, మంజునాథ్, ఉమామహేష్, నాని, సమీర్, ప్రవీణ్, ఆశీష్, సుఫియాను, గణేష్, కెవిఆర్ బాబు, తరుణ్, వరుణ్, కార్తీక్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సంస్థను కాపాడుకుందాం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలకు అనేక సేవలు చేస్తున్న ఆర్డీటీ సంస్థను కుల, మత, రాజకీయాలకు అతీతంగా అండగా నిలిచి కాపాడుకుందాని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. వైసిపి ఆధ్వర్యంలో మంగళవారం ఉరవకొండలోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో రాజకీయ, ప్రజా, కుల, విద్యార్థి సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఆర్డీటీకి విదేశీ విరాళాలు అందని పరిస్థితి నెలకొందన్నారు. ఆర్డీటీ సేవలు కొనసాగాలంటే విదేశీ నిధులు తప్పనిసరి అన్నారు. కావున కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి విదేశీ నిధులను పునరుద్ధరించేంత వరకూ అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు.

గుత్తి : ఆరు దశాబ్దాలుగా కరువు అనంతపురం జిల్లాలో బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న ఆర్టీటీ సేవలను పునరుద్ధరించాలని పలువురు డిమాండ్ చేశారు. ఆర్డీటీ సంస్థపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడానికి నిరసిస్తూ గుత్తి ఆర్ఎస్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు పేదల ఉన్నత విద్యాభివృద్ధికి ఆర్టీటీ కృషి చేస్తోందన్నారు. అలాంటి సంస్థకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్తలు గద్దల మస్తానప్ప సీనియర్ నాయకులు పెద్దల నాగరాజు, వైసిపి నాయకులు జిఎం బాషా, భీమలింగప్ప, మహిళా సంఘం నాయకురాలు గద్దల జయమ్మ, ఆర్ఎస్ నాయకులు మందల నాగరాజు, పులి ఈశ్వరయ్య, స్టోర్ డీలర్ మస్తాన్, అరుణ్ ఆదినారాయణ, ఆర్డీటీ సిడిసి సభ్యులు నరసింహులు, ఆర్‌డిటి స్కూల్ టీచర్లు లచ్చనపల్లి రంగయ్య, అంజలి, రామకృష్ణ, లచ్చానుపల్లి మస్తానప్ప, తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

శింగనమల : అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆర్ఒ వాటర్‌ప్లాంట్‌ను మంగళవారం ప్రారంభించారు. అలాగే రోగులు కూర్చొనేందుకు కుర్జీలు, డైనింగ్ హాల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాని అభయ ఫౌండేషన్ బాలచంద్ర స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ అధికారి రవికుమార్, ఇఒఆర్‌డి వెంకటలక్ష్మి, సిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహినాథ్, ప్రవీణ్‌కుమార్, టిడిపి మండల కన్వీనర్ గుప్తా ఆదినారాయణ, నాయకులు గోరంట్ల మారుతీనాయుడు, దేగల కృష్ణమూర్తి, బోయ సత్యనారాయణ, మాసూల చంద్రమోహన్, ఎం.ఆదినారాయణ, సి.వెంకటేష్, కాయల రమణయాదవ్, అనిల్‌కుమార్, కాయగూరల సత్తి, శివ, బయన్న, జడేజా, మాజీ డీలర్ శంకర్, శోధనపల్లి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఆత్మకూరు : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ లక్ష్మణరావు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని కళ్యాణదుర్గం–అనంతపురం రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా నిబంధనలను అతిక్రమించి వేగంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఇబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బండిశూల ఉత్సవాలు ప్రారంభం

పెద్దవడుగూరు : మండలంలోని గుత్తిఅనంతపురం, కాశేపల్లి గ్రామాల మధ్యలో వెలసిన సుంకులమ్మ, ముత్యాలయ్య బండిశూల తిరుణాల బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఐదురోజుల పాటు జరిగే ఉత్సవాలను ఎంతో భక్తిశ్రద్ధలతో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకోనున్నారు. ఈమేరకు ఆయా గ్రామాల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

రోగులకు పండ్లు పంపిణీ

పామిడి : ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీచేశారు. అంతకుముందు అంబేద్కర్ సర్కిల్‌లో కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శరత్‌బాబు, ప్రధాన కార్యదర్శి షేక్షావలి, వేణు, కార్యదర్శి లాలుస్వామి, వడ్డే రాము, కత్రిమల సుబ్బు, అడ్వకేట్ సతీష్, జమీర్, సూరి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి పొన్నూరు స్వామి పర్యవేక్షణలో మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా రూ.10,96,642 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అలాగే రెండు అమెరికన్ డాలర్లు, వెండి మిశ్రమ వస్తువులు 2తులాల 600 గ్రాములు, బంగారు మిశ్రమ వస్తువులు 11తులాల 100 మిలిగ్రాములు వచ్చినట్లు పర్యవేక్షణ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి సాకే రమేష్‌బాబు, గుంతకల్లు హనుమాన్ సేవాసంస్థ సభ్యులు, కెనరా బ్యాంకు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక చేయూత

బుక్కరాయసముద్రం : ప్రభుత్వం మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి ఆర్థిక చేయూత అందించేందుకు కృషి చేస్తోందని ఎంపిపి దాసరి సునీత, ఎంపిడిఒ సొలమన్‌రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని డిఆర్‌డిఎ వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా శిక్షణకు వస్తున్న మహిళల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం నారాయణస్వామి, టైలర్ లక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని గుండిగానిపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త హరిజన యల్లప్ప కుటుంబ సభ్యులకు టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు మంగళవారం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. హరిజన యల్లప్ప అప్పుల బాధతో వారంరోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో టిడిపి నాయకులు యల్లప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ నాగిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శివలింగప్ప, డీలర్ కేశవర్దన్‌గౌడ, ఐ టిడిపి ఛాంపియన్ బజ్జన్నగౌడ, తిప్పేస్వామి, తిప్పన్న, ఈరన్న, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ కట్టించుకుని రెన్యువల్ చేయాలి

బ్రహ్మసముద్రం : కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని రైతు రుణాలు రెన్యువల్ చేయాలని టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల పరిధిలోని వేపులపర్తి యూనియన్ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు వారు వడ్డీతోపాటు అసలు కట్టించుకుని రెన్యువల్ చేస్తున్నారన్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు బ్యాంకు ఉన్నతాధికారి స్పందించి వడ్డీ మాత్రమే కట్టించుకుని లోన్ రెన్యువల్ చేయిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్రకార్యదర్శి కురుగౌడ, క్లస్టర్–1 ఇన్‌ఛార్జి ఓబులేష్, క్లస్టర్–2 ఇన్‌ఛార్జి నాగరాజు, మాజీ ఎంపిపి వన్నూరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లతో సమీక్ష

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి చిగురుపాటి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈనెల 12న పెద్దపేట గ్రామంలో నిర్వహించనున్న ఫైలేరియా నైట్ బ్లడ్ కలెక్షన్‌పై ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అలాగే గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, డ్రైడే ఫ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జుబేదా, సూపర్‌వైజర్, రామ్‌ప్రసాద్‌గౌడ్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

బెలుగుప్ప : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న శ్రీసత్యసాయి భజన మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని తహశీల్దార్ సిఎస్.షర్మిల ప్రారంభించారు. ఇందులో భాగంగా ఛేంజ్ ఫర్ సొసైటీ టీం ఆధ్వర్యంలో కర్నూలు ఆమెలియే కంటి ఆసుపత్రి, అనంతపురం మార్క్ హార్ట్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు గుండెకు సంబంధించి 100 మందికిపైగా చికిత్స చేయించుకోగా 13 మంది ఆపరేషన్‌కు, కంటికి సంబంధించి 35 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రాచెర్ల రాజశేఖర్, రాచెర్ల ప్రణవ్‌సాయి, కాశంశెట్టి సుధీర్, రాచెర్ల నారాయణ స్వామి, కెబి హనుమంతురాయుడు, ఛేంజ్ ఫర్ సొసైటీ టీం వ్యవస్థాపకులు జాబివుల్లా షేక్, రాచర్ల రాజశేఖర్, తిలోత్తమ, లహరి, వన్నూరుస్వామి, మధు, తిప్పేస్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ దాణా పంపిణీ

పామిడి : స్థానిక పశు వైద్యశాలలో పాడి రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై మంజూరు చేసిన దాణా బస్తాను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ ఉషాకిరణ్, టిడిపి మండల కన్వీనర్ ముసలిరెడ్డి, ఎహెచ్ఎలు, పాడిరైతులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల వినతి

అనంతపురం కలెక్టరేట్ : గ్రామ వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న విద్యా, సంక్షేమాభివృద్ధి సహాయకులు కార్యదర్శులకు పదోన్నతి సమస్యలు పరిష్కరించాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యకుడు వర ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి వి.లక్ష్మీనారాయణ కోరారు. మంగళవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాఘవేంద్రరావు, జిల్లా కోశాధికారి మహేష్, బి.రామకృష్ణ, డి.సుధాకర్, గిరి ప్రసాద్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.